సాక్షి రంగారెడ్డి

బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



‘నెక్’ ఎన్నికలు వాయిదా

పౌల్ట్రీ రైతుల మధ్య వాగ్వాదంతో షాద్‌నగర్‌లో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ (నెక్) ఎన్నికలు వాయిదా పడ్డాయి. 8లో▸



ఓటు హక్కుపై అవగాహన

విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన అవసరమని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేశ్ అన్నారు. 8లో▸



అవకతవకలు సహించం

ఎరువుల విక్రయాల్లో అవకతవకలు సహించేదిలేదని షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజారత్నం అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 99592 26287 నంబర్ ద్వారా విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



రైతు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత

తుర్కయంజాల్: రైతుల అభివృద్ధి, సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం అని డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఆయన అధ్యక్షతన సంఘం కార్యాలయంలో మంగళవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ నుంచి జనవరి వరకు జమ, ఖర్చుల ఆమోదం, కొత్తగా సభ్యులను చేర్చుకోవడం, స్వల్పకాలిక, దీర్ఘకాలిక అప్పులు, పాత బకాయిదారులపై చట్టపరమైన చర్యలు, అప్పుల వసూలు గురించి చర్చించారు. అనంతరం ఇటీవల మరణించిన బ్రాహ్మణపల్లికి చెందిన రైతు సంరెడ్డి రంగారెడ్డి కుటుంబ సభ్యులకు రూ.25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, కొండ్రు స్వప్న, చాపల యాదగిరి, లక్ష్మమ్మ, నర్సింగ్ రావు, కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, భార్గవి, సంఘం సెక్రటరీ వై.రాందాసు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన పీసీబీ అధికారులు

షాద్‌నగర్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న రైతుల పంట పొలాలను మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించారు. గ్రామ పరిధిలో ఉన్న పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంతో పంటలు పండటం లేదని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఫెడరేషన్ ఆఫ్ యంగ్ పీపుల్ స్వచ్ఛంద సంస్థ వారు రైతుల పక్షాన హైకోర్టును ఆశ్రయించింది. పిటీషన్ స్వీకరించిన హైకోర్టు ఇటీవల సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలికట్ట శివారులో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ సైంటిస్టు విద్యుల్లత ఆధ్వర్యంలో పొలాలను పరిశీలించడంతో పాటు బోర్ల నుండి నీటి నమూనాలను సేకరించారు.

శ్రీశైలం వెళ్లిన బిహార్ ఎమ్మెల్యేలు

మంచాల: రెండు రోజుల క్రితం మంచాల మండలం కాగజ్‌ఘట్‌లోని ఓ రిసార్ట్‌కు బిహార్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వచ్చిన విషయం తెలిసిందే. ఆదివారం ఇక్కడకు చేరుకున్న వీరు మంగళవారం మధ్యాహ్నం వరకు రిసార్ట్‌లోనే గడిపారు. అనంతరం ఏపీలోని శ్రీశైల మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్లినట్లు సమాచారం. ఈనెల 11వరకు ఎమ్మెల్యేలు ఇక్కడే ఉండే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రిసార్ట్ సెక్యూరిటీ సిబ్బందిని సైతం ఎమ్మెల్యేలు ఉండే పరిసర ప్రాంతాలకు రానీయడం లేదు.

రైతులకు ‘పరీక్ష’



నాలుగేళ్లుగా మట్టి పరీక్షలు బంద్

- మూతబడిన భూసార పరీక్ష కేంద్రాలు
- మట్టిలో పోషకాల మోతాదు తెలియక ఇబ్బందులు
- ఇష్టానుసారంగా ఎరువులు వాడి నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని వ్యవసాయశాఖ
- కేంద్రం నుంచి నిధులు రానందునే అంటున్న అధికారులు



ఇబ్రహీంపట్నంలో మూతపడిన భూసార పరీక్ష కేంద్రం

యాచారం: భూమిలో ఉండే పోషకాల మోతాదును బట్టి ఎరువులు, పురుగు మందులు వాడితే పెట్టుబడి ఖర్చు తగ్గడంతోపాటు దిగుబడి బాగా పెరుగుతుంది.పోషకాల మోతాదు తెలియాలంటే భూసార పరీక్షలే కీలకం. అలాంటి పరీక్షలు నిర్వహించడం వ్యవసాయ శాఖ నిలిపేసింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల పరిధిలోని వ్యవసాయ పొలాల్లో మట్టిని సేకరించి డివిజన్ కేంద్రంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు చేసేవారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో మట్టిని సేకరించి పరీక్షలు చేసి మే, జూన్ నెలల్లో రైతులకు తెలియజేస్తే ఏఏ పంటలు వేసుకోవాలి, ఏ మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడాలనే ఆలోచన చేసేవారు. డివిజన్‌లోని ఐదు మండలాల్లో 250 శాంపిల్స్ చొప్పున 1,250 శాంపిల్స్ సేకరించి మట్టి పరీక్షలు చేసేవారు. నాలుగేళ్లుగా వ్యవసాయ శాఖ రైతుల నుంచి శాంపిల్స్ సేకరించడమే మానేసింది.

భూసార పరీక్ష కేంద్రానికి మూత

ఈ భూసార పరీక్ష కేంద్రం ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి వికాస్ యోజన) పర్యవేక్షణలో కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో కేంద్రం నిర్వహణ జరుగుతోంది. రైతుల వ్యవసాయ పొలాల్లోంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల కేంద్రానికి పంపి పరీక్షలు చేయడం ద్వారా ఒక్కో శాంపిల్‌కు రూ.50 వరకు ఖర్చవుతుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో భూసార పరీక్షల జాడే లేకుండా పోయింది. ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లో భూసార పరీక్షల కేంద్రం రైతులతో కిటకిటలాడేది. ప్రస్తుతం మూతబడి వెలవెలబోతోంది.

అవగాహన కరువై..

భూసార పరీక్షలు చేయకపోవడంతో రైతులు పంటల్లో తీవ్రంగా నష్టపోతున్నారు. అవగాహన లేక పంట బాగా పెరగాలనే ఆశతో ఇస్టానుసారంగా డీఏపీ, యూరియా వాడుతున్నారు. ఎకరా పొలంలోనే దాదాపు రూ.5వేల నుంచి రూ.10 వేలకు పైగా ఖర్చు చేసి ఎరువులు వినియోగిస్తున్నారు. జిల్లాలోనే ఏటా అత్యధికంగా ఇబ్రహీంపట్నం డివిజన్‌లోనే పత్తి సాగు చేస్తారు. మాడ్గుల్, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో 80 వేల ఎకరాలకుపైగా సాగవుతుంది. పత్తితో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తారు. మట్టిలో పోషకాల స్థాయి తెలియకపోవడంతో లక్షల రూపాయలు ఎరువులకే ఖర్చు చేస్తున్నారు. అధికంగా వాడడంతో కొందరికి దిగుబడి కలిసిరాగా, మరి కొందరు పంట తెగుళ్ల బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా భూసార పరీక్షలు చేపట్టేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

స్పందన లేదు



భూసారంలో మోతాదు తెలియక ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందులు వాడుతున్నాం. కొన్నిసార్లు పంట బాగా రాగా, మరికొన్ని సార్లు ఎండిపోతోంది. నాలుగేళ్లుగా భూసార పరీక్షల జాడే లేదు. పలుమార్లు వ్యవసాయ అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు.

– కోలన్ బుచ్చిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

కేంద్రం నుంచి నిధులు రాకనే..



నాలుగేళ్ల క్రితం వరకు గ్రామాల్లో మట్టి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేసి పోషక విలువలను బట్టి ఏ మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడాలో రైతులకు సూచించేవాళ్లం.భూసార పరీక్షల కేంద్రం నిర్వహణ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది.కేంద్రం నుంచి నిధులు రాకే పరీక్షలు నిలిచిపోయాయి.

– సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి, యాచారం

మోదీ నాయకత్వంలో
దేశం అభివృద్ధి

- మరోసారి అధికారంలోకి రావడం ఖాయం
- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మహేశ్వరం:దేశ ప్రజలు మరోసారి మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ‘గావ్ చలో’ (పల్లెకు పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో పర్యటించారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందని అన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 నుంచి 400 వరకు ఎంపీ సీట్లు గెలుపొంది మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.500 ఏళ్ల రామ మందిర స్వప్నం మోదీతోనే సాకారమైందన్నారు. స్వచ్ఛభారత్‌తో 11 కోట్ల టాయిలెట్ల నిర్మాణం, జన్‌ధన్ యోజన కింద 50 కోట్ల మందికి బ్యాంకు సేవలు చేరవయ్యాయన్నారు. పేదలకు ఆసరా గా ఉజ్వల యోజన,ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, విశ్వకర్మ, గరీబ్ కళ్యాణ్ యోజన పథకాలను తీసుకొచ్చారన్నారు. తెలంగాణలో 40 లక్షల రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏడాదికి రూ.6 వేల సాయం అందించిందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 29 లక్షల కుటుంబాలకు ఆరోగ్య భరోసా లభించిందని తెలిపారు. రాష్ట్రంలో 18.75 లక్షల మంది మహిళలకు ఉజ్వల పథకం కింద లబ్ధి చేకూర్చినట్టు చెప్పారు. కరోనా సమయంలో రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా బియ్యం పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఆవాస్‌యోజన కింద ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మెజార్టీ ఎంపీ స్థానాలు గెలిచి మోదీకి కానుకగా ఇస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్రంలో మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కిషన్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పుడు, అమలు కానీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేలా బీజేపీ ప్రజల పక్షాల కొట్లాడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి బి.పాపయ్య గౌడ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు తూళ్ల వీరేందర్ గౌడ్, వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ అనంతయ్య గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదిష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.



పల్లెకు పోదాం రండి కార్యక్రమంలో భాగంగా అమీర్‌పేట్ గ్రామంలో పర్యటిస్తున్న కిషన్‌రెడ్డి

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు జేఎల్‌ఎం బలి

- వేధింపులు భరించలేక ఉరి వేసుకుని బలవన్మరణం
- ఒక్కగానొక్క కుమారుడి మృతితో గుండెలు బాదుకుంటున్న తల్లిదండ్రులు

ఇబ్రహీంపట్నం: సరదాగా ప్రారంభమైన ఆన్‌లైన్ బెట్టింగ్.. వ్యసనంగా మారి అప్పుల పాలుచేసింది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఒత్తిళ్లు, రుణదాతల నుంచి వేధింపులు తట్టుకోలేక విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మన్ (జేఎల్‌ఎం)గా పనిచేస్తున్న యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మైబెల్లి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్‌కు చెందిన గుండ్లపల్లి శివారెడ్డి(28) యాచారం మండలం మేడిపల్లిలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్నాడు. సరదాగా మొదలైన ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసగా మారాడు. గతంలోనే అప్పుల బాధ భరించలేక ఇల్లు వదలిపెట్టి పోయి తిరిగివచ్చాడు. తండ్రి నర్సింహారెడ్డి కుమారుడు చేసిన అప్పులను సగానికి పైగా తీర్చాడు. అయినప్పటికీ శివారెడ్డి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు కొనసాగించడంతో అప్పులు తీరకపోగా.. రుణం ఇచ్చిన వారినుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం తండ్రి శంషాబాద్‌లోని పెద్ద కుతూరు ఇంటికి వెళ్లగా.. గ్రామంలో కిరాణ దుకాణం నడిపించే తల్లి సావిత్రి రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లింది. లోపల నుంచి గడియ పెట్టి ఉండటంతో శివారెడ్డిని పిలిచింది. గట్టిగా తలుపులు బాదినా స్పందన లేకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె చుట్టుపక్కల వారిని పిలిచింది. తలుపులు పగులగొట్టి చూడగా శివారెడ్డి ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతన్ని ఇబ్రహీంపట్నం అస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



శివారెడ్డి (ఫైల్)

రాయపోల్‌లో విషాదఛాయలు

ఒక్కగానొక్క కుమారుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌ల మోసానికి బలికావడంతో తల్లిదండ్రులు సావిత్రి, నర్సింహారెడ్డి, బంధువులు గుండెలు బాదుకున్నారు. నాలుగేళ్లుగా మేడిపల్లి జేఎల్‌ఎంగా పనిచేస్తున్న తన కొడుకు నెలకు రూ.40 వేల జీతం ఎత్తేవాడని, గతంలోనే బెట్టింగ్‌లతో అప్పులు కాగా ఓ సారి ప్లాట్ అమ్మి కట్టానని విలపించాడు. రూ.26 లక్షల వరకు చెల్లించినా మరికొంత మిగిలి ఉన్నట్లు చెప్పాడని, అది కూడా త్వరలోనే తీర్చేద్దామని, ఇందుకోసం కొంత భూమిని అమ్మేద్దామని భరోసా కల్పించానని వాపోయాడు. వేధింపులు తట్టుకోలేకే చేతికి వచ్చిన చెట్టంత కొడుకు అఘాయిత్యానికి పాల్పడ్డాడని బోరుమన్నాడు. శివారెడ్డి మృతితో రాయపోల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలి

- ప్రత్యేకాధికారులకు కలెక్టర్ శశాంక సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేకాధికారులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేకాధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2వ తేదీ నుంచి బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటునందించాలని అన్నారు. 2018 పంచాయతీరాజ్ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్యాంకు అకౌంట్ గురించి, గ్రామంలోని ప్రత్యేక సమస్యలైన తాగునీరు, పారిశుద్ధ్యం, కోర్టు కేసులపై అవగాహన ఉండాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీరు ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. టీకేజీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు 100 రోజులు పని కల్పించాలని తెలిపారు. హరితహారం మొక్కలు పెంపకం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 15న పంచాయతీ ప్రత్యేక గ్రామ సభ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేయాలని సూచించారు. అధికారులు సరైన సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదని, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్, మిషన్‌భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, ఎస్ఈ పీఆర్ రాజేశ్వర్, అడిషనల్ పీడీ నీరజ పాల్గొన్నారు.

చేతి వృత్తులకు చేయూత

చేతి వృత్తులకు చేయూతనివ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై కుల వృత్తుల సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కులవృత్తులకు శిక్షణ ఇవ్వడం ద్వారా తరతరాలుగా వస్తున్న కళా నైపుణ్యాలకు వన్నెలద్దడమే కాకుండా ఆర్థిక పరిపుష్టిని కలిగించినట్లవుతుందని తెలిపారు. ఈ పథకానికి 18 రకాల కులవృత్తులు చేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతోపాటు రూ.15వేల టూల్ కిట్‌ను ప్రోత్సాహకంగా అందిస్తామన్నారు. వడ్డీ రాయితీ, రుణసదుపాయంతో వ్యాపార అవకాశాలు పెంపొందుతాయన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ తేదీ నాటికి 18 నుంచి 60 ఏళ్ల వయసు వరకు ఉండలన్నారు. గత ఐదేళ్లలో స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ రుణాలు తీసుకుని ఉండకూడదన్నారు. ముద్ర, స్వనిధి పథకాల లబ్ధిదారులు తమ రుణాలు చెల్లించినట్లయితే విశ్వకర్మ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందన్నారు. మండలాల్లో ఎంపీడీఓ, మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పథకం గురించి అధికారులకు ఇండస్ట్రీస్ జీఎం రాజేశ్వర్‌రెడ్డి వివరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, డీసీబీ అధికారి ధాత్రిదేవి, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి సంధ్యారాణి పాల్గొన్నారు.

ఏసీబీ హడల్

హెచ్‌ఎండీఏలో రెండో రోజూ ఫైళ్ల తనిఖీలు

- హైరైజ్ భవనాల అనుమతులు, భారీ లేఅవుట్‌లపై ఫోకస్
- వివిధ జోన్‌ల అధికారులపై ప్రశ్నల వర్షం
- శివబాలకృష్ణ అనుయాయులపై ప్రధాన దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏలో రెండో రోజూ ఏసీబీ దాడులు హడలెత్తించాయి. అమీర్‌పేట్‌లోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో ఉన్న హెచ్‌ఎండీఏ కార్యాలయానికి మంగళవారం ఉదయమే చేరుకున్న ఏసీబీ అధికారులు వివిధ జోన్‌లకు చెందిన ఫైళ్లను తెప్పించుకొని తనిఖీ చేశారు. హెచ్‌ఎండీఏ కార్యాలయంలోని ఏడో అంతస్తులో ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు కొనసాగించారు. ఫైళ్లను పరిశీలించే క్రమంలో హెచ్‌ఎండీఏలోని ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లకు చెందిన ప్లానింగ్ అధికారులు, ఏపీఓలను తమ వద్దకు రప్పించుకొని పలు అనుమతులపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ముఖ్యంగా 2018 నుంచి 2023 వరకు పని చేసిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ హయాంలో ఇచ్చిన హైరైజ్ భవనాల అనుమతులపై ప్రధానంగా దృష్టి సారించినట్లు సమాచారం.

ఆ జోన్‌ల ఫైళ్లపైనే నజర్..

- వివిధ జోన్‌లలో భారీ లేఅవుట్‌లకు అనుమతులివ్వడంలో చోటుచేసుకున్న అవకతవకలపైనా ఏసీబీ ఫోకస్ పెట్టింది. మరోవైపు ఏసీబీ సోదాల నేపథ్యంలో హెచ్‌ఎండీఏ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగో అంతస్తు నుంచి ఏడో అంతస్తుకు ఉరుకులు పరుగులు పెట్టారు. ఒకవైపు ఏసీబీ అధికారులు అడిగిన సమాచారాన్ని, ఫైళ్లను అందజేయడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు ప్లానింగ్ అధికారులు పరుగులు పెట్టారు. మొదటి రోజు సుమారు 26 మంది ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా, మంగళవారం రెండో రోజు 10 మందికి పైగా అధికారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు శంషాబాద్, శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్‌లకు సంబంధించిన ఫైళ్లనే తనిఖీ చేశారు. శివబాలకృష్ణ హయాంలో ఇచ్చిన అక్రమ అనుమతులపై ముందస్తు సమాచారాన్ని సేకరించిన ఏసీబీ అధికారులు...ఆ సమాచారానికి సంబంధించిన వివరాలను మరింత లోతుగా సేకరించేందుకే ఫైళ్లను తనిఖీ చేసినట్లు తెలిసింది.

బడా సంస్థల అనుమతులే టార్గెట్..

- నిర్మాణరంగంలో బడా సంస్థలుగా కొనసాగుతున్న కొన్నింటికి శివబాలకృష్ణ అడ్డగోలుగా అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా హైరైజ్ భవనాలకు అనుమతులనిచ్చే క్రమంలో కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులను ఇచ్చారు. ఈ క్రమంలో మాస్టర్‌ప్లాన్ నిబంధనలను కూడా తుంగలో తొక్కినట్లు ఆరోపణలు ఉన్నాయి. అడ్డగోలు అనుమతులను ఇవ్వడంలో ప్రస్తుతం సెలవులో ఉన్న ఒక ఏపీఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ గుర్తించింది. మరో ఇద్దరు ప్లానింగ్ అధికారులు కూడా శివ బాలకృష్ణకు అన్ని విధాలా అనుకూలంగా ఉండి అక్రమ అనుమతుల్లో ప్రధాన భాగస్వాములుగా నిలిచినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.
- తాజా సోదాల్లో ఈ మూడు జోన్‌లకు సంబంధించిన ఫైళ్లనే ప్రధానంగా విచారిస్తున్నారు. తెల్లాపూర్, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను సైతం పక్కన పెట్టి చెరువుల్లో భారీ కట్టడాలకు అనుమతులిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.
- శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, బంజారాహిల్స్ ప్రాంతాల్లో పార్కులు, ఎమ్యూనిటీస్ కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించి భవనాలను నిర్మించేందుకు అప్పట్లో హెచ్‌ఎండీఏ అనుమతులను ఇచ్చిందని బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు శివ బాలకృష్ణను తమ కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తున్న అధికారులు, మరోవైపు ఏసీబీ కార్యాలయానికి వచ్చే బాధితుల నుంచి కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఇలా శివబాలకృష్ణ నుంచి సేకరించిన వివరాలు, బాధితుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని అందుకు సంబంధించిన ఫైళ్లపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిసింది.

అంతా టెన్షన్.. టెన్షన్..

మంగళవారం సాయంత్రం వరకు ఫైళ్లను పరిశీలించిన ఏసీబీ అధికారులు కొన్నింటిని తమతో పాటు తీసుకెళ్లినట్లు తెలిసింది. కొన్ని బడా సంస్థలకు చెందిన అనుమతులపైనే అధికారులు ప్రధానంగా దృష్టి సారించి తమ సోదాలు కొనసాగించారు. దీంతో శివబాలకృష్ణ ఆదేశాల మేరకు అప్పట్లో ఆయా బడా సంస్థలకు అన్ని విధాలా సహకరించిన అధికారులు ఇప్పుడు సందిగ్ధంలో పడ్డారు. ఆ ఫైళ్లు, ఆ అనుమతులు తమ మెడకు చుట్టుకుంటాయేమోననే భయాందోళనకు గురవుతున్నారు. శివబాలకృష్ణకు ప్రధాన అనుచరుడిగా వ్యవహరించిన ఒక ఏపీఓ ఇప్పటికే సెలవులో వెళ్లిపోవడం ఏసీబీ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది.

వృద్ధుడి బలవన్మరణం


అనంతయ్య(ఫైల్)

మొయినాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన గంగపాక అనంతయ్య(70) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల సమస్య తీవ్రమవ్వడంతో మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం మొయినాబాద్ సంతకు వెళ్లి పురుగుమందు కొనుగోలు చేసుకుని వచ్చాడు. ఇంట్లోనే పురుగు మందు సేవించి అనంతరం మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతట గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎరువుల విక్రయాల్లో అవకతవకలు సహించం

సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజారత్నం

కొందుర్గు: ఎరువుల విక్రయాల్లో డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేదిలేదని షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజారత్నం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం చౌదరిగూడ మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి, స్టాకు బుక్కులు, బిల్లుల పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కాలం చెల్లిన విత్తనాలు, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లులు తీసుకోవాలని, కాలపరిమితి, లాట్ నంబర్ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రాజారత్నం

ఓటు హక్కుపై అవగాహన అవసరం

వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన అవసరమని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేశ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సిస్టమ్ ఓటర్స్ ఎడ్యుకేషన్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవీఎంల పనితీరు, పోలింగ్ స్టేషన్ల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ... విద్యార్థులు ఓటు హక్కు వినియోగం , విలువలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకునే విధానాన్ని తెలుసుకోవాలని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రజలకు విలువైన ఆయుధాన్ని ఇచ్చిందని.. అదే ఓటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంగరకలాన్ శ్రీనివాస స్కూల్ డైరెక్టర్ లక్కరాజు రాధిక, చైర్మన్ లక్కరాజు శ్రీనివాస్‌రావు, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థి

'నెక్'ఎన్నికలు వాయిదా

షెడ్ అద్దెకు తీసుకున్న రైతులకు ఓటు హక్కు కల్పించడంపై పౌల్ట్రీ యజమానులు అభ్యంతరం

షాద్‌నగర్: పౌల్ట్రీ రైతుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో షాద్‌నగర్‌లో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ (నెక్) ఎన్నికలు వాయిదా పడ్డాయి. నెక్ సీఈఓ విజిల్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం షాద్‌నగర్ నెక్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు పట్టణంలోని కేకేఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్లు స్వీకరించి విత్‌డ్రా చేసుకునేందుకు సమయాన్ని కేటాయించారు. ఓ వర్గానికి చెందిన పలువురు రైతులు ఓటరు జాబితా పై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఓటరు జాబితాలో పౌల్ట్రీ షెడ్ యజమానులకు కాకుండా అద్దెకు తీసుకున్న రైతులకు ఓటు హక్కు కల్పించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కేవలం పౌల్ట్రీ షెడ్ యజమానులకు మాత్రమే ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చిన వారితో వాగ్వాదానికి దిగారు. షెడ్‌లను అద్దెకు తీసుకున్న రైతులకు ఓటు హక్కు కల్పించాలని మరో వర్గం రైతులు డిమాండ్ చేశారు. నెక్ అధికారులు ఒక వర్గం వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కొందరు రైతులు ఆరోపించారు. ఓటరు జాబితా రూపొందించాక అద్దె రైతులు అని షరతులు విధించడం సరికాదని మరి కొందరు రైతులు వాపోయారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని ఇరు వర్గాల వారికి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. రైతుల అభ్యంతరాల నేపథ్యంలో నెక్ ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు సీఈఓ విజిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నెక్ ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి నారాయణరావు ప్రకటించారు.


అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న పౌల్ట్రీ రైతులు

అథ్లెటిక్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు

కేశంపేట: సబ్ జూనియర్ అథ్లెటిక్ మీట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 400 మీటర్ల పరుగుపందెం పోటీల్లో జిల్లా స్థాయిలో మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెరిశారు. 7వ తరగతి చదువుతున్న స్పందన, సుప్రియలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో తైక్వాండో పోటీలను నిర్వహించారు. అందులో పాఠశాలకు చెందిన మహిపాల్ ఉత్తమ ప్రతిభను కనబరిచి బ్లాక్ బెల్టును సాధించారు. ఈ మేరకు విద్యార్థికి ఢిల్లీ నుంచి సర్టిఫికెట్లు రావడంతో ప్రధానోపాధ్యాయుడు అందించారు. ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల మండల విద్యాధికారి మనోహర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిప్రసాద్, అబ్దుల్‌భారీ, శిరీష, సుజాత, తైక్వాండో మాస్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సొండెపూర్‌తండాలో చోరీ

నాలుగు తులాల బంగారం, 45 తులాల వెండి ఆభరణాల అపహరణ

పరిగి: మేకలను మేతకు తీసుకెళ్లి వచ్చే వరకు ఓ వ్యక్తి ఇల్లు గుల్లయింది. ఈ సంఘటన మండల పరిధిలోని సొండేపూర్‌తండాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన హిర్యానాయక్ ఇంటికి తాళం వేసి మేకలను పొలం దగ్గర మేతకోసం కట్టివేసేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు వచ్చి ఇంటి ప్రహరీ దూకి ఇంట్లోని 4 తులాల బంగారం , 45 తులాల వెండి ఆభరణాలు దొంగిలించుకు వెళ్లారు. హిర్యానాయక్ ఇంటికి వచ్చే సమయంలోనే దుండగులు ఇంటి నుంచి బయటకు వస్తున్నారు. దీంతో ఎవరు మీరు.. ఇంట్లోకి ఎందుకు వెళ్లారు అని ప్రశ్నించగా.. ఇంటి నంబర్ వేసేందుకు వచ్చామని చెప్పి పరారయ్యారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

వివాహిత అదృశ్యం


శారద(ఫైల్)

కొత్తూరు: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని కొడిచర్ల తండాలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొడిచర్లతండాకు చెందిన సభావట్‌కుమార్, శారద(24) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. కాగా ఈ నెల 3న శారద తన భర్తకు ఫోన్‌చేసి తాను పిల్లలను ఇంట్లోనే వదిలేసి ఇంటి నుంచి వెళ్తున్నాని చెప్పి ఫోన్ స్విచ్చాఫ్ చేసింది. భర్త ఇంటికి రాగా అప్పటికే శారద ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికిన లభ్యం కాకపోవడంతో భర్త కుమార్ మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

హైదరాబాద్ సౌత్ డీఆర్ సస్పెన్షన్

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు శంకర్‌పల్లి పరిధిలోని ఒక భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ సౌత్ జిల్లా రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మంగళవారం రిజిస్ట్రేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. కొనుగోలుదారుల్లో ఒకరు హైదరాబాద్ డీఆర్ భార్యేనని నిర్ధారణ కావడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయిన విషయం విదితమే.

ఎట్టకేలకు..

19న కౌన్సిల్ మీటింగ్

- హైకోర్టులో పిటిషన్ నేపథ్యంలో అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం
- బడ్జెట్, సాధారణ సమావేశం రెండూ ఒకే రోజు
- అసెంబ్లీ తరహాలో రెండు మూడు రోజులైనా జరపాలన్న సభ్యులు



సాక్షి, సిటీబ్యూరో: విషయం హైకోర్టుకు చేరిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు కసరత్తు మొదలైంది. సుదీర్ఘకాలంగా కౌన్సిల్ సమావేశం జరగకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేవంటూ మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ (బీజేపీ) హైకోర్టును ఆశ్రయించడం.. అందుకు వివరణనివ్వాల్సిందిగా స్టాండింగ్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించడంతో జీహెచ్‌ఎంసీలో చర్యలు మొదలయ్యాయి. కార్పొరేటర్లతో ఆగమేఘాలపై మంగళవారం మేయర్ అఖిలపక్ష సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎలాంటి ఆటంకాలు ఎదురవని పక్షంలో ఈ నెల 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. అదే రోజు బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించాలని భావించారు. రేపటి (గురువారం) నుంచే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటం.. ఈ నెల రెండో వారం తర్వాత ఎప్పుడైనా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందనే అంచనాల నేపథ్యంలో ఈ తేదీని నిర్ణయించారు. కుదరని పక్షంలో అటూఇటూగానైనా నిర్వహించే అవకాశం ఉంది.

ఆ సమావేశాలు జరగని రోజుల్లోనే..

సాధారణంగా సభ్యులు సమావేశంలో ప్రస్తావించాల్సిన ప్రశ్నల్ని స్వీకరించేందుకు, అధికారులు వాటికి లిఖితపూర్వక సమాధానాలు సిద్ధం చేసేందుకు దాదాపు నెలరోజుల సమయం పడుతుంది. కానీ.. ఇప్పటికే బాగా ఆలస్యం కావడంతో పాటు లోక్‌సభ ఎన్నికల కోడ్ వస్తే ఇక సాధ్యం కాదు గనుక త్వరితంగా సమావేశం నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అసెంబ్లీ, లోక్‌సభ సభ్యులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరు కావాల్సి ఉన్నందున అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు జరగని రోజుల్లో మాత్రమే జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తారు. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఈ నిర్ణయం తీసుకున్న వెంటనే సభ్యుల నుంచి ప్రశ్నలను తీసుకోవడం కూడా ప్రారంభించారు.

ఒకే రోజు రెండు సమావేశాలు..

ప్రస్తుతం జీహెచ్‌ఎంసీకి స్టాండింగ్ కమిటీ లేకపోవడంతో రాబోయే ఆర్థిక సంవత్సర బడ్జెట్ నేరుగా కౌన్సిల్ సమావేశంలోనే ఆమోదం పొందేందుకు అనుమతించాల్సిందిగా సీఎంను కలిసిన మేయర్ విన్నవించడం.. అందుకు సీఎం సానుకూలంగా స్పందించడంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకేరోజు ఉదయం బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం, దాని తర్వాత సాధారణ సమావేశం నిర్వహించాలని భావించారు. ఫలానా తేదీన సమావేశం నిర్వహిస్తున్నామని హైకోర్టుకు వివరణ ఇవ్వనున్నారు.

కుదరని సయోధ్య?

మేయర్, కమిషనర్ల మధ్య ఇంకా సఖ్యత కుదరలేదని సమాచారం. సీఎం ఆదేశాల నేపథ్యంలో కాబోలు.. బడ్జెట్ సమావేశ నిర్వహణకు ఓకే అన్న కమిషనర్.. సాధారణ కౌన్సిల్ సమావేశ నిర్వహణకు ఇంకా సుముఖంగా లేనట్లు తెలిసింది.

రెండు మూడు రోజులు నిర్వహించాలి

- ఎంతోకాలం తర్వాత జరిగే సమావేశంలో సభ్యులందరికీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని అఖిలపక్ష సమావేశంలో సభ్యులు కోరారు. అవసరమైతే అసెంబ్లీ తరహాలో రెండుమూడు రోజుల పాటు సమావేశాలు కొనసాగించాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇతరత్రా ప్రభుత్వ విభాగాలైన వాటర్‌బోర్డు తదితరాలు, జీహెచ్‌ఎంసీకి మధ్య సంబంధం లేకుండా ఉండటం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటి మధ్య అనుసంధానం ఉండేలా ఒక తీర్మానం చేయాలని సభ్యులు సూచించారు. అలాగే మరికొన్ని అంశాలపై తీర్మానాలు చేయాలని చెప్పారు.
- జీహెచ్‌ఎంసీలో డిప్యుటేషన్లపై కొనసాగుతున్న వారిని పంపించడం, పండగల సందర్భంగా చేసే ఏర్పాట్లకు నిధుల మంజూరు తదితరాలు వాటిలో ఉన్నాయి. పారిశుద్ధ్యం, దోమల తీవ్రత, కుక్కకాట్లు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై సమావేశంలో చర్చించాలని భావించారు. అఖిలపక్ష సమావేశానికి బీఆర్‌ఎస్ నుంచి డిప్యూటీ మేయర్ శ్రీలత, సామల హేమ, బి.గీతాప్రవీణ్, సతీష్, సింధురెడ్డి, బీజేపీ నుంచి శ్రవణ్, వంగ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి రజితా పరమేశ్వర్‌రెడ్డి, విజయారెడ్డి, సీఎస్ రెడ్డి, ఎంఐఎం నుంచి మీర్జా ముస్తఫాబేగ్, సయ్యద్ మినాజుద్దీన్ తదితరులు హాజరయ్యారు.

సూర్యాపేట అభివృద్ధి ఆదర్శనీయం

మున్సిపాలిటీని సందర్శించిన షాద్‌నగర్ చైర్మన్, కౌన్సిలర్లు


సూర్యాపేటలో మహాప్రస్థానాన్ని పరిశీలిస్తున్న షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో కమిషనర్, కౌన్సిలర్ల బృందం మంగళవారం సూర్యాపేటలో పర్యటించింది. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వ్యర్థాలను వేరు చేసి ఇటుకలు, కంపోస్టు ఎరువులను తయారు చేయడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చుకోవడం అభినందనీయమన్నారు. బాలెంల సమీపంలోని డంపింగ్ యార్డ్‌లో చెత్త, వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని తెలుసుకున్నారు. జమునానగర్‌లో ఉన్న ఘనవ్యర్థాల ప్లాంట్‌ను సందర్శించి అక్కడ పొడి చెత్త, ప్లాస్టిక్ మ్యాట్‌లను తయారుచేసే విధానాన్ని, కంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. అనంతరం మినీ ట్యాంక్‌బండ్ పక్కనే ఉన్న మహాప్రస్థానాన్ని సందర్శించారు. జమ్మిగడ్డలో నెలకొల్పిన అండర్ గ్రౌండ్ ద్వారా వచ్చే డ్రెయినేజీ నీటిని శుద్ధి చేసే ఎస్టీపీ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ చామ వెంకన్న, సూర్యాపేట మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సతీష్, ఆర్‌ఐ శివరాం రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎస్ఎస్ ఆర్ ప్రసాద్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాజేంద్రనగర్: విద్యుదాఘాతానికి గురై ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన సలీం మియా (28) నగరానికి వలస వచ్చాడు. చాంద్రాయణగుట్ట ప్రాంతంలో ఉంటూ విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి రెడ్డి బస్తీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం విద్యుత్ సరఫరాను నిలిపివేసి పనులు చేపడుతున్నారు. స్తంభంపై మరమ్మతులు చేపడుతుండగా విద్యుత్ షాకు గురై సలీం మియా తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు హుటాహుటినా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విద్యుత్ లైన్‌ను ఆపివేసి కరెంట్ సరఫరా ఎలా అయిందో అన్నదానిపై ప్రస్తుతం ఆ శాఖ అధికారులు విచారణ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించండి

తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్

కడ్తాల్: బీసీలకు చట్టసభలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య. వివిధ బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో మంగళవారం మండల కేంద్రానికి చెందిన రాఘవేందర్ పాల్గొని మద్దతు ప్రకటించారు. బీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకటించాలని.. కులగణన చేపట్టాలని.. రాజకీయ, ఆర్థిక, విద్యారంగాల్లో బీసీలకు సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశామని రాఘవేందర్ తెలిపారు.



జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న రాఘవేందర్


కేసీఆర్ నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేలు సబితారెడ్డి, సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాగంటి, మల్లారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు